


ఆకాశంలో నీరెండ పాకుతోంది. చెట్ల సందుల్లోంచి పడుతున్న కిరణాలలో గడ్డి మొక్కలపై వున్న మంచుబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయ్. సన్నని నీరెండ చల్లటి గాలి కలసి వింత అనుభూతిని యిస్తున్నాయ్. కాంపౌండ్ చివరగా కుర్చీలో పడుకుని పేపరు చదువుకుంటున్న మేజిస్ట్రేటుగారికి శీతాకాలం కాబట్టి పొద్దు తెలియటం లేదు. యింట్లోంచి వినబడుతున్న పిల్లల కేకలు ఆయనకి విసుగు తెప్పిస్తున్నాయ్. వాళ్ళు స్కూలుకు వెళ్ళే టయిము ఆయింది. రిక్షా అప్పన్న యింకా రాలేదు. విసుక్కుంటూ లోపలకి వెళ్ళారు. శ్రీమతిగారు వున్న యిద్దరు పిల్లలతో అతలా కుతల మవుతోంది.

"వీళ్ల వెళ్ళలేదు. యింకా రిక్షావాడు రాలేదా?" భార్య నడిగాడు.

"ఏం వస్తాడూ— ఎక్కడో తాగి పడుకుంటాడు" అంటూ, 'వీరయ్యా' అని పిలిచింది. బంట్రోతు పరుగెత్తుకుంటూ వచ్చాడు "పిల్లల్ని రిక్షాలో తీసుకొని వెళ్ళి, స్కూలు దగ్గర దింపేసిరా—"

అమ్మగారి మాటలకు తలాడిస్తూ, పిల్లలని తీసుకొని గేటు దాటాడు. మేజిస్ట్రేటు గారు మళ్ళీ తన కుర్చీ దగ్గరకు వచ్చారు.

"అప్పన్న యీ రోజూ రాలేదు. వాడు యిలా తయారవుతున్నాడేంటి?" తనలో తనే ప్రశ్నించుకున్నారు. వాడంటే ఆయనకి ఎందుకనో అభిమానం. వాడి పెళ్ళాం సుబ్బి తమ యింట్లో పనిచేస్తూంది కాబట్టి మాత్రం కాదు. రిక్షా అప్పన్న చాల నమ్మకస్తుడు. పిల్లల వంటినిండా నగలు దిగేసి పంపినా, చెక్కు చెదరకుండా తిరిగి వస్తారు పిల్లలను వాడికి వప్పగించుతే, మళ్ళీ వాళ్ళకేసి తిరిగి చూడనక్కర్లేదు. కాని వాడు యీ మధ్య వట్టి బుడ్డిదాసుగా మారిపోయాడు—

మారిపోతున్నాడు— అయినా వాడిని మార్చి యింకొక రిక్షా కుదుర్చుకోడానికి. మేజిస్ట్రేటు గారికి మనసు పోవటం లేదు-అలాగే వాడిని భరిస్తున్నారు.

పది గంటలు అవుతోంది. అలవాటు ప్రకారం డైనింగ్ టేబిలు దగ్గరకు వచ్చారు. దొడ్లో అప్పన్న భార్య సుబ్బి. అమ్మగారితో ఏదో చెప్పుకుంటో ఏడుస్తోంది— వాళ్ళ మాటలు మేజిస్ట్రేటుగారికి బాగానే వినబడుతున్నాయ్.

సుబ్బి అంటోంది ఏడుస్తూ.

"యెదవకి నిన్న రేతిరి బాధ ఎక్కువయ్యిందండి. భరించలేక పీక దాకా తాగేసినాడు. యాడకీ ఎళ్ళకురా అంటే. యినక రిక్షా తీసుకుపోయాడు. మరేం జర్గిందో-ఏటో-ఆడు ఎవరో ఆడ పాసింజరుని అవమానపరచాడని రాత్రినుంచి పోలీసోళ్ళు బొక్కలో తోసేశారమ్మా—ఎలాగున్నాడో ఏమో?"

"యింకా వదిలెయ్యలేదా?" మేజిస్ట్రేటుగారి భార్య అడిగింది.

"నేదండి—యీ ప్రొద్దు అయ్యగారి కాడ నిలబెడతారంట. అయ్యగారికి సెప్పండమ్మా—ఆడిని జైల్లో ఏస్తే. ఆ కడుపులో బాధతో సస్తాడమ్మా" ప్రబతిమిలాడుతోంది సుబ్బి.

"సరేలే-చూస్తా- యీయన నా మాట వింటేగా" నెమ్మదిగా గొణుక్కుంటూ లోపలకి వచ్చి. మేజిస్ట్రేటుగారికి వడ్డన ప్రారంభించింది.

"వినే వుంటారు-సుబ్బి గోల" అంది ఆయనకేసి చూసి.

"ఆ...." మేజిస్ట్రేటుగారు ముక్తసరిగా చెప్పారు. ఆయన అలా అంటే. యింకేమీ చెప్పనక్కరలేదని అర్థం. అది గ్రహించిన ఆవిడ యింకేమీ చెప్పలేదు. మేజిస్ట్రేటు గారు టేబిలు దగ్గరనుంచి లేవబోతూంటే.

# విదేశ విహారం

విదేశాల్లో విహరిస్తూ
స్వదేశాన్ని
స్వదేశ సౌందర్యాన్ని.
నా సర్వాన్ని
మరిచిపోయినా.
మదిలో మెదిలే
నిన్నూ. నీ ప్రేమనీ
క్షణమైన మరిపించలేదు
నన్ను మురిపించిన
ఆ దేశం. విదేశం!

—సుశీల

అంది, "వాడికి చాలా కాలం బట్టి కడుపులో ఏదో నొప్పిట. ఒక్కొక్కప్పుడు చాల భయంకరంగా వుంటుందిట. ఆ బాధ భరించలేక వాడు తాగుతాడుట. ఆ మైకంలో ఏదో చేసుంటాడు."

మేజిస్ట్రేట్‌గారు బుర్ర వూపుకుంటూ గది బయటకు నడిచారు.

సుబ్బి చెప్పినట్టుగానే. అప్పన్నని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు—మామూలు తాగుడు నేరం పైన కాదు—రాత్రి వాడు రిక్షాలో ప్రయాణం చేస్తున్న ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడని—జామీను కోసం ఎవరూ రానందువల్ల. విచారణ జరిగేటంత వరకు జైల్లో వుంచమని ఆర్డరు వేశారు.

రోజులు గడిచాయి. అప్పన్న జైల్లోనే వున్నాడు. ఉన్నట్టుండి వాడు విపరీతమయిన కడుపు నొప్పితో ఉంగలుచుట్టుకుపోయేవాడు. రక్తం కక్కుకోడం మొదలు పెట్టాడు. ధర్మాసుపత్రి డాక్టరు దగ్గరకు పంపితే. ఏదో టెంపరరీ ట్రీట్‌మెంటు యిచ్చి. వాడికి ఈ చిన్న ధర్మాసుపత్రి వైద్యం చాలదనీ. రెండు మూడు నెలల్లో 'ఎపెండిసైటిస్'కు పెద్దాసుపత్రిలో ఆపరేషను జరపాలనీ. లేకపోతే బ్రతకడనీ చెప్పారు.

"బాబూ, ఆడ్ని రక్షించండి బాబూ- ఆడ్ని వగ్గేస్తే కష్టపడి వయిద్యం చేయించుకుంటా బాబూ- నా పసుపుకొమ్ము నిలబెట్టండి బాబూ- చచ్చి మీ కడుపున పుడతా" అంటో ఏడుస్తోంది సుబ్బి.

"ఏం చేస్తావే నీవు? వాడికి చాల పెద్ద ఆపరేషను కావాలిట. వేల వయిన ఖర్చు పెడితేనేగానీ అది జరగదు. నీవెలా చేయిస్తావే?" మేజిస్ట్రేటుగారు అనుమానంగా అడిగారు.


"ఆడ్ని వగ్గేయండి బాబూ - నా తలతాకట్టుయెట్టి చేయించుకుంటా బాబూ - ప్లీడరుబాబు చెప్పాడు. తమరు ఇటువంటి కేసులో నెలలకు నెలలూ శిక్ష ఏయొచ్చుట. మొదట తప్పిదంగా ఆడిని తిట్టి ఒగ్గేయచ్చంట-అలాగే ఒగ్గేయండి బాబూ— ఆ అధికారం మీకుందట బాబూ...." తల మేజిస్ట్రేటు గారి పాదాలపై ఆన్చి ఏడుస్తోంది.

మేజిస్ట్రేటుగార్కి- వారి సర్వీసులో కోర్టులోని కేసు గురించి యిలా రికమెండ్ చేస్తూ మాట్లాడటం. బతిమాలడం బామాలడం యిదే మొదటిసారి – యింత వరకు. కేసుల తాలూకు వాళ్ళని ఆమడ దూరంలో వుంచారు-కానీ-అనుకోనివిధంగా సుబ్బికి తన యింట్లో ప్రవేశించే హక్కు- పనిమనిషిగా ఏర్పడింది—

మేజిస్ట్రేటుగారు ఆలోచిస్తున్నారు. సుబ్బికి తెలిసిన 'లా' పాయింటు కరక్టే. యిటువంటి కేసులో తను రెండేళ్ళవరకు శిక్ష వేయవచ్చు- ముద్దాయి యితరత్రా మంచివాడయితే. యిదే ప్రథమ నేరం అయితే. మందలించి ప్రథమ తప్పిదంగా వదలివేయవచ్చు— పైగా యీ కేసులో యింతవరకూ అయిన సాక్ష్యం అంతంత మాత్రంగానే వుంది. తను యీ కేసు కొట్టివేయవలసి వుంటుందేమో—?"

కాని సుబ్బి యింత ధైర్యంగా వచ్చి అడుగుతూందీ అంటే— యిది అంతా ఆ ముక్కుపొడుం ప్లీడరు కుయుక్తులే. మేజిస్ట్రేటుగారికి చాల కోపం వచ్చింది ఆ నల్లకోటుపై—

"సుబ్బీ.... నాకు తోచింది చేస్తా- నీవు



అది వ్యతిరేకంగా వుండనుకుంటే పై కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు- ఆ సంగతి మీ ప్లీడరుగారు చెప్పలేదా?" సుబ్బికేసి పరిశీలనగా చూస్తూ అడిగారు—

"ఏంది బాబూ- తమరు సిచ్చవేస్తే పై కోరుటుకు యెల్లే ఓపిక ఏదీ బాబు మాకు- ఆ ప్లీడరు బాబుకి యియ్యడానికే పైసా లేదు బాబు- యింక నేనేకోరుటుకు పోయేది బాబు-" సుబ్బి ఏడుస్తోంది - దూరంగా మేజిస్ట్రేటుగారి శ్రీమతి నుంచొని వింటోంది—

"మరి వానికే డబ్బులు లేకపోతే వాడికి వేలకు వేలూ ఖర్చుపెట్టి వైద్యం ఎలా చేయిస్తావే సుబ్బీ?" అర్థం కానట్లుగా అడిగారు.

సుబ్బి మాట్లాడలేదు.

మేజిస్ట్రేటుగారు యింకేమీ అడక్కుండా బయటకు వెళ్ళారు-సుబ్బి కళ్ళు తుడుచుకుంటూ యింటి పనులు చూసుకోవడానికి లోపలకు వెళ్ళింది- మేజిస్ట్రేటుగారి శ్రీమతికి వారి పద్ధతి బొత్తిగా నచ్చలేదు. అయినా నోరు మెదపలేకపోయింది.

రోజులు గడిచాయి. కేసు విచారణ పూర్తి అయింది. వాదనలు మొదలు పెట్టారు. అప్పన్న ప్లీడరు గుక్క తిప్పుకోకుండా దీర్చి చెండాడాడు. ప్రాసిక్యూటరు అప్పుడప్పుడు నీళ్ళు నమిలాడు. మేజిస్ట్రేటుగారు మాత్రం శాంతంగా విన్నారు. విన్నవాళ్ళు, అక్కడ వున్న వాళ్ళు అంతా అనుకొన్నారు కేసులో బలం లేదనీ, అప్పన్నని విడుదల చేసి తీరుతారనీ. సుబ్బి కొండంత ఆశతో వుంది. కేసులో బలం తన వైపునే వుంది. పైగా అయ్యగారికి తనంటేనూ, అప్పన్న అంటేనూ వల్లమాలిన అభిమానం— ప్లీడరు బాబు చాల నమ్మకంగానూ, గట్టిగానూ చెప్పాడు. కేసు పోయి తీసతుందని.

సాయంత్రం మేజిస్ట్రేట్‌గారు వూరు అవతల గుడి వరకూ షికారుగా పోయి ప్రక్కనే వున్న పార్కులో కూర్చున్నారు. మనస్సు చాలా చికాకుగా వుంది. మాటిమాటికీ 'లంగలు' తిరుగుతూ—రక్తం కక్కుతున్న అప్పన్నా- మొగుడిని రక్షించమంటూ ఏడుస్తున్న సుబ్బీ కళ్ళ ముందు కన్పిస్తున్నారు- ఆయన పార్కు బెంచీలో వెనక్కి వాలారు.


"మానవుడు నిష్కామ కర్మను ఆచరించుటకే అధికారం కలదు కానీ, దాని ఫలితమును ఆశించకూడదు- అలాగునని కర్మ చేయటం మానరాదు" గుడి మైకులోంచి గంభీరంగా వినిపిస్తోంది. మేజిస్ట్రేటు గారు కళ్ళు మూసుకొనే శ్రద్ధగా వింటున్నారు.

"కర్మ అంటే యజ్ఞయాగాదులే కాదు- కాలమాన పరిస్థితులనుబట్టి, దానిని అన్వయించుకోవాలి. మనం చేసే ప్రతీపనీ కర్మగానే భావించాలి. స్వార్థంతో చేసే ఎంత మంచి కార్యమయినా సత్ఫలితాన్ని యివ్వదు. మనం ఆచరించే- చేసే ప్రతి పనీ నిస్వార్థంతో చేయాలి. కాని దాని ఫలితం ఎవ్వరికైనా హానికల్గించేదయితే దానిని ఆచరించకపోవటమే ఉత్తమం. అలాగునే యింకొకరిని నొప్పించి బాధించే నిజం చెప్పటకంటే మరే నేరమూ వుండదు. అందుకే నిస్వార్థంతో చేసే ఏ అకార్యమయినా పరులకు రక్షణ యిచ్చే అసత్యమయినా స్వార్థంతోచేసే సకార్యము కన్నా, పరులకు హాని కలిగించే 'సత్యం' కన్నా గొప్పవి. మనం ఆచరించే కర్మలు- వాటి పర్యవసానం ఫలితం దృష్టిలోవుంచుకొని చేయాలి."

మైకులో ఉపన్యాసం సాగుతోంది. మేజిస్ట్రేటుగారు అన్యమనస్కంగా లేచారు.

# హృదయశిల్పం

దూరంగా వున్న
ఓ చెలీ!
భారమైన నా హృదయాన్ని
రాయిగా మార్చుకున్నాను!
కాని.
నీ జ్ఞాపకాలు దాన్ని
శిల్పంగా మార్చాయి!
ఆ అపురూప లావణ్య రాశికి



నా ప్రేమానురాగాలు
ప్రాణం పోశాయి!
నాలో నిలిపాయి!
అందుకే
నిన్ను మరిచేదెలా?
కన్నులు మూసేదెలా?

—వందన

మర్నాడు అప్పన్న కేసులో తీర్పు చెప్పారు. ఎవ్వరూ వూహించలేదు. అప్పన్నకు చట్టంలో వున్నంతమేరకూ శిక్ష విధించారు — ఏడాది కఠిన కారాగార శిక్ష- సుబ్బి కుప్పకూలిపోయింది. అప్పన్న మౌనంగా విన్నాడు.

"చట్టంలో అంతకన్నా ఎక్కువ వ్రాయలేదు- వుంటే వేసునేమో?" చాల వేళాకోళంగా అన్నాడు డిఫెన్సు లాయరు మేజిస్ట్రేటుకు వినిపించకుండా.

"ఇంతవరకూ చరిత్రలో లేదు - యీ నేరానికి యింత శిక్షవేయడం" పక్కనున్న సీనియరు లాయరు కామెంటు చేశాడు.

బోనులో నుంచి అప్పన్నను బయటకు తీసుకొని వస్తూంటే, అప్పన్న కడుపు నొప్పితో లుంగ చుట్టుకుపోయాడు. విపరీతమయిన దగ్గు వచ్చింది. రెండుసార్లు రక్తం వాంతి చేసుకున్నాడు.

కోర్టు లోపలా బయటా వున్న జనంలో మేజిస్ట్రేటుగారిని శపించనివాడు ఒక్కడూ లేడు. ఆ 'సీను' చూడలేక మేజిస్ట్రేటుగారు బెంచి దిగి లోపలకు వెళ్ళిపోయారు. సుబ్బి రోదనలతో కోర్టుహాలు మార్మోగిపోయింది. అది ఆ దేవునితోపాటుగా మేజిస్ట్రేటుగారిని కూడా తిట్లతో శపించింది.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి సుబ్బి మేజిస్ట్రేటుగారిని, వారి వంశాన్నీ తిట్టిశపించి మరీ పోయింది. మేజిస్ట్రేటుగారి ఇల్లాలు చాల వ్యాకులత చెందింది. ఆమె మనసు వికలమయింది. ఎన్నడూ లేంది భర్త అంటే ఒక విధమయిన ఏహ్యాభావం కల్గింది ఆమెకు.

ఎప్పుడో ఒకసారి ఆయన్ని పొరపాటుగా బ్రతిమిలాడితే ఆయన నీతీ నిజాయితీకి అడ్డువచ్చిందా? తనకు ఏదో రికమెండేషన్ చేసినట్లు ఆయన భావించితే యీ కేసు యింకో కోర్టుకు బదిలీ చేయమని అడగవచ్చుగా? నిర్దోషిని శిక్షించటమా? వాళ్ళ వుసురు తప్పక తగులుతుంది. ఆ భగవంతుడు కూడా ఎప్పుడూ క్షమించడు!! ఆ ఆలోచనలతో మనిషి పాపం చాల అప్‌సెట్ అయ్యింది.

ఇంటి వాతావరణంలోని మార్పులు ఇట్టే గ్రహించారు మేజిస్ట్రేటుగారు. తనని తన భార్యే కాదు— ఆఖరికి తన బంట్రోతులు కూడా అదోలా చూస్తున్నారు. ఘోరమయిన హత్య చేసిన హంతకుని చూస్తున్నట్లుగా తప్పుకు తిరుగుతున్నారు. వంటరిగా మిగిలిపోయారు మేజిస్ట్రేటుగారు.

రోజులూ, వారాలూ, నెలలూ గడిచాయి.

## సాహితీ క్విజ్

1. "తిమిరంతో సమరం"—అనే గ్రంథాన్ని వ్రాసింది.
2. 1950 ప్రాంతంలో "నారాయణభట్టు" అనే తెలుగు నవలను వ్రాసింది.
3. "గద్య చింతామణి" వ్రాసిన నవ్య వాగనుశాసనుడు.
4. విజ్ఞాన చంద్రికా గ్రంథమాల పేరిట గ్రంథాలు ప్రచురించిన నవ్య విజ్ఞాన ప్రసారకుడు.
5. ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ-వంటి ప్రముఖ ఖండకావ్యాలు రచించిన ప్రముఖకవి.
6. నూతిలో గొంతులు—అనే కవితా గ్రంథం వ్రాసినది.
7. "రాజరాజు" అనే నవలను రచించిన ప్రముఖ కథా రచయిత.
8. "ఫర్గాటెన్ ఛాప్టర్స్ ఆఫ్ ఆంధ్రా కంట్రీ" అనే వ్యాస గ్రంథాన్ని వ్రాసిన ప్రముఖ చారిత్రక సాహితీవేత్త.
9. "ఎంకి పాటలు"—రచయిత
10. "మార్క్‌ట్వెయిన్" నవలలు తెలుగులో అనువదించినది.

నిర్వహణ : ఎం. డి. సౌజన్య

**సమాధానాలు**

1. దాశరథి
2. నోరి నరసింహశాస్త్రి
3. గిడుగు రామమూర్తి పంతులు
4. కొమర్రాజు లక్ష్మణరావు
5. జంధ్యాల పాపయ్యశాస్త్రి
6. ఆలూరి బైరాగి
7. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
8. మల్లంపల్లి సోమశేఖరశర్మ
9. నండూరి సుబ్బారావు
10. నండూరి రామమోహనరావు

ఆ సాయంత్రం యథాప్రకారం లాన్‌లో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు మేజిస్ట్రేటుగారు. అప్పన్నని ఆరోజే విడుదల చేశారనీ. వాడు కోర్టుకు వెళ్ళాడనీ. అయ్యగారు అక్కడ లేకపోతే యింటికేసి వస్తున్నాడనీ మేజిస్ట్రేటుగారి యిల్లాలుకు తెల్సింది. మనిషి చలించిపోయింది. వణుకుతోంది. సమయానికి యింట్లో బంట్రోతు కూడా లేదు. ఎలా?-వీధి గేటుకేసి వెళ్ళింది. అప్పన్న వస్తున్నాడు. ఆవిడ గజగజలాడింది. వాడు రానే వచ్చాడు. గేటు తలుపు తెరుచుకున్నాడు. మేజిస్ట్రేటు గారి వైపు అడుగులు వేస్తున్నాడు. అప్పుడే వచ్చిన బంట్రోతు, వెనక నుంచి వచ్చి పట్టుకున్నాడు. అప్పన్నకి ఏనుగు బలం వుంది. పూర్వం లేని శక్తి వుంది. ఒక్కసారి గింజాయించుకున్నాడు. బంట్రోతు తూలిపడ్డాడు. వాడు మేజిస్ట్రేటు గారికేసి వస్తున్నాడు. ఆయన వాడికేసి చూస్తున్నారు. ఎవ్వరికీ మాటల్లేవు. మేజిస్ట్రేటుగారి భార్య వణికిపోతూ. తన పసుపు కుంకుమలు నిలబెట్టమని మనసులో ఏడుకొండలవాడిని వేడుకుంటోంది—

అప్పన్న రెండు క్షణాలు మేజిస్ట్రేటు గారికేసి చూసి, గబుక్కున ఆయన పాదాల మీద పడ్డాడు; భోరుమని ఏడ్చుకుంటూ. అందరూ అవాక్కయ్యారు. మేజిస్ట్రేటు గారి యిల్లాలు ఆశ్చర్యభరితురాలయింది.

"నన్ను క్షమించండి బాబూ-యెదవని—మిమ్మల్ని అన్యాయంగా తిట్టుకున్నా-ప్రాణం పోసినారు మీరు. నా జీవితం, సుబ్బి పసుపు కుంకుమలు నిలబెట్టారు. నా చర్మంతో చెప్పులు కుట్టించినా మీ ఋణం తీరదు బాబూ—"ఆయన పాదాలపై తలబెట్టి ఏడుస్తున్నాడు.

మొగుడు వచ్చాడని తెలిసి వాడు ఏం అఘాయిత్యం చేస్తాడోనని భయంతో పరుగు పరుగున అప్పుడే వచ్చిన సుబ్బికి అసలు ఏమీ అర్థంకాలేదు.

'సంవత్సరం జైలుశిక్ష వేసిన మనసులేని మేజిస్ట్రేటుకు ఎందుకు మొక్కుతున్నాడో' అని.

"మామా....మామా"అంటూ భోరుమంది. అప్పన్నని చూసిన సుబ్బి ఆశ్చర్యపడింది. పీక్కుపోయిన కళ్ళు. దొక్కుపోయిన మొహం. బక్కచిక్కిన శరీరం. నడచి వస్తున్న శవంలా వుండే తన అప్పన్న పిడిదుక్కలా. ఏనుగు బలంతో కళకళలాడుతున్నాడు.

"సుబ్బీ. అయ్యగారికి మొక్కవే. నీ తాళిబొట్టు నిలబెట్టారే. ఆయన ఋణం తీర్చుకోలేమే" అన్నాడు అప్పన్న సుబ్బికేసి చూస్తూ.

"ఏంది మావా?" అర్థంగాక ఆశ్చర్యంగా అడిగింది.

"అవునే. నీలాగే తెలియక బాబుగారిని తిట్టుకున్నానే. నన్ను కేసులోంచి బయట పడేస్తే ఆ కడుపులోని పుండుతో ఈ ధర్మాసుపత్రుల చుట్టూ గొడ్డులా తిరిగి కుక్కచావు చచ్చేవాణ్ణే. అందుకే బాబుగారు నాకు బలవంతంగా శిక్ష వేసి. గవర్నమెంటు ఖైదీగా చేశారే. జైల్లో వుండి యీ జబ్బుతో ఛస్తే వాళ్ళ పీకల మీదికి వస్తుందని డాక్టర్లూ. పోలీసులూ దగ్గర వుండి యీ వయిద్యం జరిపించారే. రాజభోగం - పది జన్మలెత్తినా యివతల వుంటే అలా జర్గేది కాదే. ఏవో రూల్సు వున్నాయట. అవి తెలుసుండబట్టే ఏయాలనే శిక్ష వేశారుట—జైలరు బాబు చెప్పాడు. పైగా బాబుగారు ఎప్పటి కప్పుడు నాగురించి వాకబుచేస్తూ వుండేవారు."

సుబ్బికళ్ళవెంబడి నీరు కారుతున్నాయ్. మేజిస్ట్రేటుగారిని తిట్టి శపించిన దాని నోరు సిగ్గుతో కుంచించుకుపోయింది. వారి కాళ్ళను చుట్టేసింది.

సాయం ఎండలో మేజిస్ట్రేటుగారి కళ్ళు నీళ్ళతో మెరుస్తున్నాయ్.

*

### ఆంక్షలు—కాంక్షలు

నిన్ను చూడాలని
తహతహ!
చూడగానే, ఆశలు
హద్దుల్ని దాటాలని
తహతహ!!
ఓ క్షణం, నా కాంక్షలు
నా హృదయాన్ని
కమ్మేసినా
మరుక్షణం
నీ ఆంక్షలు గుర్తొచ్చి
వేగుతున్న నా కోర్కెలు
ఆగుతాయి అలాగే!
యిలా ఎన్నాళ్ళయినా
యిది ఎన్నేళ్ళయినా
నీవే నా
జీవనాధారం సుమీ!!

—బి. శారదాదేవి